# నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
## నారాయణపేట
5 మహబూబ్‌నగర్, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024
MAHABUBNAGAR NARAYANPET


# మొసలి హల్‌చల్

- గుడ్డెందొడ్డి పాఠశాల ఆవరణలో ప్రత్యక్షం

ధరూరు, సెప్టెంబర్ 12 : పాఠశాలలోకి ఓ భారీ మొసలి వచ్చి ప్రజలను భయాందోళనలకు గురిచేసిన ఘటన మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ పర్వేజ్ అహ్మద్ కథనం మేరకు.. మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామ సమీపంలోని నెట్టెంపాడు కాల్వ నుంచి గురువారం ఓ భారీ మొసలి గ్రామంలోని పాఠశాల దగ్గరకు వచ్చింది. దీన్ని గ్రామంలోని రైతులు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారి పర్వేజ్ అహ్మద్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని మొసలిని బంధించి జూరాల డ్యాంలో వదిలి పెట్టినట్లు తెలిపారు. పట్టుబడిన మొసలి 150 కేజీల బరువు ఉన్నట్లు ఫారెస్ట్ అధికారి తెలిపారు.



జూరాల డ్యాంలో మొసలిని వదులుతున్న అధికారులు

# గో బ్యాక్ ఫార్మా



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మద్దూరు (కోస్గి), సెప్టెంబర్ 12 : ఫార్మా గోబ్యాక్ అంటూ ఫార్మా బాధిత రైతులు హకీంపేట్, లగచర్ల, పులిచర్లకుంట తండా, రోటిబండతండా రైతులు గురువారం కోస్గి మండలంలోని హకీంపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఫార్మా కంపెనీ స్థాపించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే త్వరలో రిలే నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి పోలేపల్లి ఎల్లమ్మతల్లి ఆలయంలో ఫార్మా కంపెనీ రాకుండా చూడాలని పూజలు చేసి అమ్మవారికి ముడుపులు కట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సురేశ్‌రాజు, శివకుమార్, బసప్ప, యాదయ్య, నర్సింహులు, అంజి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

# లక్ష్మారెడ్డికి ఓదార్పు

- మాజీ ఎంపీ సంతోష్, మంత్రి పొంగులేటి పరామర్శ



లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న పొంగులేటి, వినోద్

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 12 : సతీమణిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను గురువారం పలువులు ప్రముఖులు పరామర్శించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తిమ్మాపేట మండలం ఆవంచకు చేరుకొని శ్వేతాలక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, కోరుకుంటి చందర్, మహేశ్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్, విజయ డైయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డితోపాటు జడ్చర్ల, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కూడా మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని కలిసి పరామర్శించారు.



చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వనపర్తి మున్సిపల్ అధికారులు

# కూల్చివేతల కలవరం

- వనపర్తి నల్లచెరువు వద్ద జేసీబీతో గోడ తొలగింపు
- 15 మంది ఇండ్ల యజమానులకు నోటీసులు జారీ
- లెక్కలు తీస్తున్న మున్సిపల్ అధికారులు

వనపర్తి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : వనపర్తి మున్సిపల్ పరిధిలోని చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఇటీవలే రాష్ట్రంలోని పలుచోట్ల చెరువుల్లోని నిర్మాణాలను కూల్చివేస్తున్న క్రమంలో ఆ సెగ వనపర్తికి పాకినట్లైంది. ఈ మేరకు గురువారం సాయంత్రం పట్టణ పరిధిలోని నల్లచెరువులో నీళ్లు రాకుండా కట్టిన ఓ గోడను అధికారులు జేసీబీతో తొలగించారు. అయితే వనపర్తి పట్టణాన్ని అనుసరించి నల్లచెరువు, తాళ్ల చెరువు, అమ్మ చెరువు, మర్రికుంటలు ఉండగా ప్రస్తుతం నల్ల చెరువు పరిధిలో 9 మందికి, తాళ్ల చెరువు పరిధిలో ఆరుగురికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే, మున్సిపల్ అనుమతులతోనే వీరంతా నిర్మాణాలు చేసుకున్నామని చెబుతుండగా, ఆ నోటీసుల జారీ వివాదాస్పదమవుతున్నది. పూర్తిస్థాయి సర్వే జరిగి ఎఫ్‌టీఎల్‌ను గుర్తించడం ద్వారానే అసలు విషయం బయట పడనుంది. ఇదిలా ఉంటే.. ఇప్పటికే రాష్ట్రంలో జరుగుతున్న కూల్చివేతలు వివాదాస్పదంగా మారుతున్నాయి. పారదర్శకత లేకుండా హైడ్రా కొనసాగుతుందని, నిరుపేదల ఇండ్లన్నీ నేలమట్టం చేస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతూనే ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను వివరణ కోరగా.. వనపర్తి పట్టణంలోని నాలుగు చెరువులకు సంబంధించి సర్వే చేస్తున్నామని, వీటిలో కొన్నింటిని గుర్తించి నిర్మాణాలు చేసుకున్న 15మందికి నోటీసులిచ్చామన్నారు. నల్ల చెరువు పరిధిలో ఉన్న చిన్న గోడను మాత్రమే తొలగించామని, ఇండ్ల వరకు వెళ్లలేదన్నారు. పూర్తి స్థాయి సర్వే నిర్వహించి ఆక్రమణలో ఉన్న వారందరికీ నోటీసులిస్తామన్నారు.



నారాయణపేట జిల్లా ధన్వాడలో నీట మునిగిన పత్తి పంట (ఫైల్)

# 14,783 ఎకరాలు వరదపాలు

- ఉమ్మడి జిల్లాలో నీటమునిగిన పంటలు
- ప్రధానంగా వరి, పత్తి పైర్లకు భారీ నష్టం
- సర్కారుకు నివేదికను పంపిన వ్యవసాయశాఖ
- సాయం కోసం ఎదురుచూస్తున్న కర్షకులు
- పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : బీఆర్‌ఎస్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేతికి వచ్చిన పంటలు వరద పాలయ్యాయి. అత్యధికంగా నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో పంటనష్టం భారీగా జరిగింది. చేతికి వచ్చిన పంటలు వరద పాలు కావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. అకాల వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగి.. కాల్వలు తెగిపోయి, చెరువులకు గండ్లు పడి పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14,783 ఎకరాలు పంటలు నీట మునిగినట్లు ఆయా జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. ఈ మేరకు సర్కారుకు పంటనష్టం వివరాలను పంపించారు. అయితే సర్కారు సాయంపై ఇంతవరకు స్పష్టత రాలేదు. కేవలం వరద బాధితులకు మాత్రమే సాయం అందిస్తామని ప్రకటించినా.. పంటలు వరద పాలైన రైతులకు ఆదుకునే విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఉమ్మడి జిల్లాలో రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఒకేరోజు 12నుంచి 14 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏకంగా చెరువులు ఉప్పొంగి వట్టెం పంప్‌హౌస్‌లోకి నీళ్లు చేరి భారీ నష్టం సంభవించింది. అదేవిధంగా చేతికి వచ్చిన వరి, పత్తి, మొక్కజొన్న ఇతర వర్షాధార పంటలన్నీ నీటి పాలయ్యాయి. అనేకచోట్ల రహదారులు తెగిపోయాయి.. కల్వర్టులు.. వంతెనల పై నుంచి నీళ్లు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇంత పెద్ద ఎత్తున భారీ నష్టం సంభవించినా సర్కారు ఇప్పటివరకు స్పందించకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అరకొరగా కొంత మందికి సాయం అందించి చేతులు దులుపుకొన్నారు. కాగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద పాలైన పంటలకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించాలని బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

***నాగర్‌కర్నూల్, పేట జిల్లాలో అత్యధిక నష్టం..***

ఉమ్మడి జిల్లాలో వారం రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. చాలా చోట్ల పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. అంచనాలకు అందని విధంగా తీవ్ర నష్టం జరిగింది. కృష్ణ పరీవాహక ప్రాంతాలు ఉన్న నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో పెద్దఎత్తున పంట నష్టం వాటిల్లింది. నారాయణపేట జిల్లాలో 11మండలాల్లో 5200ఎకరాల్లో వరి, పత్తి, కందులు, రాగులు, జొన్నలు, పొద్దు తిరుగుడుతోపాటు ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. ఇక నాగర్‌కర్నూల్ జిల్లాలో 4,162 ఎకరాల్లో పంటనష్టం సంభవించినట్లు అధికారులు తేల్చారు. 2,173మంది రైతుల పంటలు నష్టపోయాయని పత్తి, వరికి అధికనష్టం జరిగిందని అంచనా వేశారు. 2,895 ఎకరాల్లో వరి, 957ఎకరాల్లో పత్తి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటలు నీట మునిగాయి. ఇక వనపర్తి జిల్లాలో 2,411 ఎకరాల పంట దెబ్బతిందని అధికారిక లెక్కలు చెబుతున్నారు. దీనిలో 85% వరి ఉంటే.. మిగిలిన 15%లో కంది, మొక్కజొన్న, మినుములు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 1294 ఎకరాల్లో వరి, పత్తి, కందులు, జొన్న ఇతర పంటలు వరద పాలయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1716 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పత్తి 597, వరి 217, కంది 552, మిర్చి 238, పొగాకు 36, బొప్పాయి ఐదు ఎకరాలతోపాటు ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయి.

***నష్టం వివరాలు సర్కారుకు..***

ఎడతెరిపి లేని భారీ వర్షాలకు పెద్ద ఎత్తున పంటలు, ఆస్తి, ప్రాణనష్టం సంభవించడంతో ఆయా జిల్లాల అధికార యంత్రాంగం జిల్లాల పరిధిలో జరిగిన నష్టాలను అంచనా వేసి సర్కారుకు నివేదించింది. పంటలతోపాటు వర్షాలకు కూలిన ఇండ్లు, ఇతర నష్టాలతోపాటు ఐదుగురు మృత్యువాత పడ్డారు. అయితే వరదలకు మరణించిన వారి కుటుంబాలకు సర్కారు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. బాధితులకు ఈ మేరకు నష్టం అందిస్తారో లేదో అనేది స్పష్టత ఇవ్వడం లేదు. ఉన్నత అధికారులకు నివేదించామని ఈ వివరాలన్నీ సర్కారుకు పంపించామని ఆయా జిల్లాల అధికార యంత్రాంగం వివరించింది.

## దెబ్బ తిన్న రహదారులు

వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రహదారులతో పాటు అనేక గ్రామీణ రోడ్లు దెబ్బతిన్నాయి. చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్–తాండూర్ రహదారి ఎన్నడూ లేనివిధంగా పది రోజులపాటు వర్షాలకు పూర్తిస్థాయిలో తెగిపోయి రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వాగులు, వంకలు ఉప్పొంగడంతో అధికార యంత్రాంగం చేపట్టిన చర్యల ఫలితంగా ప్రాణనష్టం తప్పింది. పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు రాత్రి పగలు తేడా లేకుండా వాగులు, వంకల వెంట ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు దెబ్బతినడంతో ఆయా శాఖలు వీటి మరమ్మతుల కోసం సుమారు రూ.100 కోట్లు అవసరం అవుతాయని సర్కారుకు నివేదిక అందజేశాయి. కానీ సర్కారు మాత్రం ఇప్పటివరకు తాత్కాలిక మరమ్మతులకు కూడా అనుమతి ఇవ్వకపోవడంతో ప్రభుత్వ యంత్రాంగమే స్థానికంగా చిన్నచిన్న కాంట్రాక్టర్లను పట్టుకుని తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. నిధులు వస్తే తప్ప పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టలేమని చెబుతున్నారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో వర్ష బీభత్సానికి అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# పెద్దపులి కలకలం

- అప్పాయిపల్లి బీట్‌లో సంచారం



పెద్దపులి అడుగులు

కొల్లాపూర్, సెప్టెంబర్ 12 : కొల్లాపూర్ రేంజ్ పరిధిలో పెద్దపులుల సంచారం రోజురోజుకూ పెరుగుతున్న ఆనవాళ్లు బయట పడుతున్నాయి. గురువారం కొల్లాపూర్ రేంజ్ పరిధిలోని మొలచింతపల్లి సమీపంలో అప్పాయిపల్లి బీట్‌లో పెద్దపులి అడుగు జాడలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. అడవిలో నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంతోనే పులుల సంఖ్య పెరిగేందుకు దోహదమైందని రేంజర్ తెలిపారు.

# విద్యార్థులు, ఉపాధ్యాయుల శ్రమదానం

- సోషల్ మీడియాలో వైరల్

ఊట్కూర్, సెప్టెంబర్ 12 : ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను వసతులు వెక్కిరిస్తున్నాయి. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాఠశాలల్లోకి వరద నీరు చేరి ప్రాంగణాలు మురికి గుంటలను తలపిస్తున్నాయి. దీంతో చాలా చోట్ల విద్యార్థులు పాఠశాల ప్రాంగణాల్లో నిలబడి ప్రార్థన చేసేందుకు అవస్థలు పడుతున్నారు. ఊట్కూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోకి వర్షం నీరు చేరడంతో కొద్ది రోజులుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే క్రమంలో గురువారం స్థానికంగా ఉంటున్న ఓ కాంట్రాక్టర్ సహకారంతో ట్రాక్టర్ మొర్రం మట్టిని వేయించగా హెచ్‌ఎం కుసుమ ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బంది స్వయంగా మట్టిని మోసి పాఠశాల ప్రాంగణాన్ని చదును చేసుకున్నారు. కాగా, మట్టిని మోస్తున్న ఫొటో, వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ చేయగా.. విద్యావ్యవస్థ భ్రష్టు పట్టిందని, ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత ఇదేనా అంటూ నెటిజన్లు ప్రశ్నించారు. హెచ్‌ఎంను వివరణ కోరగా.. పాఠశాల ప్రాంగణం బురదగా ఉండడంతో దాత సహకారంతో మట్టిని తెప్పించామని, జీపీ కార్మికులు సగం వేసి వెళ్లిపోవడంతో శుక్రవారం ప్రార్థన సమయానికి ఆటంకం లేకుండా మధ్యాహ్నం అందరం కలిసి శ్రమదానం చేశామన్నారు.



మట్టిని మోస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

# పాల బిల్లులు చెల్లించాలి

- జడ్చర్లలో పాలను పారబోసి ధర్నా నిర్వహించిన పాడి రైతులు
- దాదాపు రూ.3కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటూ ఆగ్రహం



జడ్చర్ల బీఎంసీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు

జడ్చర్ల, సెప్టెంబర్ 12 : పెండింగ్‌లో ఉన్న పాలబిల్లులు చెల్లించాలంటూ పాడి రైతులు గురువారం జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డలో ప్రధాన రహదారిపై పాలడబ్బాలతో వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలను పారబోసి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు రైతులు జడ్చర్లలోని బీఎంసీ దగ్గరకు వెళ్లి పెండింగ్ డబ్బులు చెల్లించాలని అడుగగా బిల్లులు వచ్చిన వెంటనే ఇస్తామని అక్కడ పనిచేసేవారు చెప్పారు. ఇప్పటికే 5 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అడిగినప్పుడల్లా ఇదే సమాధానం ఇస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి బీఎంసీ షటర్‌వేసి అక్కడే ఆందోళనకు దిగారు. ఈ సమయంలో రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్నారన్న విషయం తెలుసుకున్న రైతులు జడ్చర్ల సిగ్నల్‌గడ్డకు రాగా అప్పటికే మంత్రి వెళ్లిపోవడంతో ధర్నాకు దిగారు. దాంతో చాలా సమయం పాటు ట్రాఫిక్‌జాం అయింది. విషయం తెలుసుకున్న ఎస్సై శివానందం అక్కడికి చేరుకొని పాడిరైతులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విజయ డెయిరీకి పాలుపోసే రైతులకు రెండు, మూడు నెలలుగా బిల్లులు రావడం లేదన్నారు. పదిహేను రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సిన ప్రభుత్వం.. ఐదింటిని పెండింగ్‌లో ఉంచినట్లు తెలిపారు. దాదాపు రూ.3కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి 15 రోజులకోసారి బిల్లులు అందేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు సమయానికి రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా పాడిగిస్తూ రెండునెలలకు పైగా పెండింగ్‌లో ఉంచడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అడిగితే ఇవాళ రేపు అంటూ తిప్పుకొంటున్నారని, బిల్లుల కోసం రోడ్డెక్కినా అధికారుల్లో స్పందనలేదన్నారు. ఒక్కో పాడిరైతుకు రూ.50వేల నుంచి రెండు లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి రైతులకు ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.



చిరునవ్వుల దరహాసంతో టిఫిన్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

# బ్రేక్ ఫాస్ట్!

- ప్రభుత్వ పాఠశాలల్లో నిలిచిన పథకం
- అల్పాహారం లేక విద్యార్థుల ఆకలి కేకలు
- కేసీఆర్ ప్రభుత్వంలో సత్ఫలితాలు
- నేడు అమలుకు కాంగ్రెస్ సర్కారు వెనుకంజ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 12 : ఖాళీ కడుపుతో పాఠశాలలకు వస్తున్న బాలల ఆకలిని తీర్చి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించింది. గత విద్యా సంవత్సరం ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా వివిధ జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో అమలు చేశారు. ఈ విద్యా సంవత్సరం పూర్తిగా అమలు చేయాలనే లక్ష్యంతో ఉండగానే ప్రభుత్వాలు మారాయి, వాటి ప్రాధాన్యాలు మారుతున్నాయి. ఫలితంగా ఇప్పటి వరకు ప్రజా పాలన ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పేద విద్యార్థులకు అల్పాహారం అందించే విషయాన్ని ఇంకా పరిశీలించలేదు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటింది. విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన కార్యక్రమాలపై దృష్టి సారించిన ప్రభుత్వం అల్పాహారంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

***ఉమ్మడి జిల్లాలో 45 పాఠశాలలు ఎంపిక***

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం ఆహారం ఇవ్వకుండా నేరుగా బడికి పంపిస్తున్న తల్లిదండ్రుల సంఖ్య అధికంగా ఉందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక సర్వేలో గుర్తించింది. ఇలా వచ్చిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం పెట్టే వరకు ఖాళీ కడుపులతోనే ఉంటున్నారని, వారికి అల్పాహారం అందించాలని నిర్ణయించింది. రోజుకో రకమైన అల్పాహారం ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ముందుగా ప్రతిజిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మొదట అమలు చేశారు. అందులో భాగంగానే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 45 పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. విద్యార్థులు అల్పాహారంపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్న విషయాన్ని కూడా అప్పుడు గుర్తించారు. గత సంవత్సరం అక్టోబర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యా సంవత్సరం వరకు కొనసాగించారు. వీటి బాధ్యతను ఎక్కువ చోట్ల మధ్యాహ్న భోజనం చేసే ఏజెన్సీలకే అప్పగించారు.

***బకాయిలు విడుదల చేసినా..***

గత విద్యా సంవత్సరం అక్టోబర్ నుంచి పెట్టిన అల్పాహారం బిల్లులు విడుదల చేసింది. కానీ మళ్లీ దీని అమలుపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరం ఇక అల్పాహారం ఉండకపోవచ్చునని కొందరు అభిప్రాయ పడుతున్నారు. బిల్లులు చెల్లించే క్రమంలోనే వాటి అమలుపై కీలక ప్రకటన వస్తుందని అందరూ ఎదురుచూశారు. కానీ ప్రభుత్వం ప్రకటన చేయకపోవడంతో అందరూ నిరాశ చెందారు.

## ఆదేశాలు రావాల్సి ఉన్నది..

గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి పాలమూరులో పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన పాఠశాలల్లో అల్పాహార పథకం అమలు చేశాం. ఈ పథకం అమలు, విద్యార్థుల ఆసక్తి తదితర అన్ని రకాలైన అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక అందించాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విద్యా సంవత్సరంలో అమలుకు సంబంధించిన ఆదేశాలు ఇంకా రాలేదు. రాగానే అమలుకు చర్యలు చేపడతాం.

*- రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్*

### ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల వివరాలు

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 859 | 79,832 |
| నాగర్‌కర్నూల్ | 848 | 82,945 |
| వనపర్తి | 537 | 53,609 |
| నారాయణపేట | 511 | 70,601 |
| జోగుళాంబ గద్వాల | 475 | 71,820 |

